క్లుప్తంగా

మంత్రికి కృతజ్ఞతలు



మంత్రి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న పూతలపట్టు నాయకులు గౌహతి రెడ్డి

తిరుపతి: పూతలపట్టు నుంచి అడవిపల్లె వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి పూతలపట్టు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గౌహతి సుబ్బారెడ్డి, తేజేశ్వర్ రెడ్డి, గుణేశ్వర్ రెడ్డి, కుమారి చంద్ర, భాగ్యలక్ష్మి శనివారం తిరుపతిలో మంత్రి నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ పూతలపట్టు నుంచి పెనుమూరు మండలం అడవిపల్లెలోని కలిగిరి కొండ రోడ్డు వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని గతంలో మంత్రికి విన్నవించినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన మంత్రి టీటీడీ అధికారులతో మాట్లాడి రహదారి ఏర్పాటుకు సుమారు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం అన్నారు. డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఆ సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని పెట్టాలన్నారు.

యువత రాణించాలి



బహుమతులు పొందిన యువకులు

చిత్తూరు అగ్రికల్చర్: యువత అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి అన్నారు. శనివారం వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా స్థానిక టీటీడీసీ ఆవరణలో సీడాప్ రిటైల్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న యువతకు పలు రకాల పోటీలను నిర్వహించారు. 'నైపుణ్యాల ప్రాముఖ్యత మరియు ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పెయింటింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన అభ్యర్థులకు ఆమె బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేడీయం సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు నగరంలోని పలు ఎరువుల దుకాణాలపై శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని ఓ ఫామ్స్, లైసెన్స్, గ్రౌండ్ స్టాక్ బుక్‌లను పరిశీలించారు. జ్యోతి ట్రేడింగ్ కంపెనీలో తనిఖీలు చేపట్టగా స్టాక్ బుక్‌లో సకాలంలో నమోదు చేయని రూ.1.90 లక్షల విలువ చేసే 14.85 టన్నుల ఎరువులను సీజ్ చేశారు. మూడు రోజుల వ్యవధిలో ఇందుకు సంబంధించిన సరైన రికార్డులను చూపాలని మెమో జారీ చేశారు. ఈ తనిఖీల్లో తిరుపతి విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి, రామక్రిష్ణ నాయక్, చిత్తూరు ఏఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఇంటి పట్టాల కోసం వినతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గిరిజనుల ఇంటి పట్టాల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. గంగవరం మండలం, కుయ్యవంక యానాది కాలనీ గిరిజనులకు ఇళ్లపట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు.

మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్‌గా తనూజ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ గా వి.తనూజకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ అరుణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న ఉమామహేశ్వర్ రెడ్డి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కమిషనర్ చర్యలు తీసుకున్నారు. ఆయన్ను రెవెన్యూ విభాగానికి బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న తనూజను మేనేజర్‌గా నియమిస్తున్నట్లు కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈచనేరిలో వైద్య పరీక్షలు

తవణంపల్లె: మండలంలోని ఈచనేరిలో 75 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించినట్లు వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఈచనేరిలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో డాక్టర్ వినయ్‌కుమార్ గర్భవతులు, బాలింతలకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నాడు టీడీపీ హయాంలో ఇన్‌కం సర్టిఫికెట్ కావాలన్నా మండల కార్యాలయానికి పరుగులు తీయాల్సిందే. పనులన్నీ మానుకుని కనీసం 15 రోజుల పాటు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాలి. ఆ తరువాత అటెండర్ నుంచి అధికారి వరకు ఎంతో కొంత ముట్టజెబితే కానీ సర్టిఫికెట్ చేతికందేది కాదు. ఇక రుణాలు, ప్రభుత్వ పథకాలు ఏవైనా కావాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాలి. వారికి కావాల్సింది ఇస్తే కేవలం టీడీపీ వాళ్లకు మాత్రమే అందించేవి. రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు అయితే ఎప్పుడు ఇస్తారో, ఎవరికి ఇస్తారో కూడా తెలియని పరిస్థితి.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాలనలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. పారదర్శకమైన సంక్షేమ పాలనకు అడుగులు పడ్డాయి. అందులో భాగంగానే సచివాలయ వ్యవస్థ ఆవిర్భవించింది. గ్రామాల్లోనే ప్రభుత్వ ఉద్యోగులు అందుబాటులోకి వచ్చారు. ప్రభుత్వ సేవలన్నీ గంటల్లో అందుతున్నాయి. రైతులు, ప్రజలు పనులు మానుకుని మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిన అవసరమే లేకుండా పోయింది. అసలైన జవాబుదారీ వ్యవస్థ మొదలైంది. రూపాయి ఖర్చు లేకుండా అన్నిరకాల సర్టిఫికెట్లను ప్రభుత్వం శిబిరాలు నిర్వహించి మరీ అందిస్తోంది.

గ్రామీణ సేవాలయాలు

- సచివాలయాలతో ప్రజలకు ముంగిట్లోనే ప్రభుత్వ సేవలు
- అసలైన జవాబుదారీ వ్యవస్థ



పి.కొత్తకోట సచివాలయంలో ఆధార్ సేవలు

కుటుంబాల సంఖ్య	12,530
జనాభా సంఖ్య	33,575
సిబ్బంది సంఖ్య	159
మొత్తం వలంటీర్లు	22
మండలానికి మంజూరైన సచివాలయాలు	17
పూర్తయిన సచివాలయ భవనాలు	12
సచివాలయంలోని సిబ్బంది	11
సచివాలయ భవన నిర్మాణాల వ్యయం	రూ.4.5 కోట్లు

పూతలపట్టు: జగనన్న ప్రభుత్వం వచ్చాక అవినీతి పాలనకు చరమ గీతం పాడింది. సంక్షేమ పాలనకు పునాది వేసింది. గ్రామీణులకు సేవలందించేందుకు, అందుబాటులో ఉండేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ వ్యవస్థ ప్రజలకు అసలైన జవాబుదారిగా మారింది. గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిన పరిస్థితి. అక్కడ అధికారులెవరూ అందుబాటులో ఉండేవారు కాదు. రెవెన్యూ, ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, ఉపాధి ఇలా ఏశాఖలో అయినా నిర్లక్ష్యం తాండవించేంది. కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా సమస్య పరిష్కారమయ్యేది కాదు. ఇలాంటివన్నీ ప్రజా సంకల్ప యాత్రలో గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే ప్రభుత్వ పథకాలు, పౌరసేవలను ప్రజలకు సులభంగా అందించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

ముంగిట్లో 72 గంటల్లోనే...

సచివాలయ వ్యవస్థ ఏర్పడడంతో గ్రామీణ ప్రజలకు ముంగిట్లోనే ప్రభుత్వ సేవలు సులభంగా అందుతున్నాయి. పూతలపట్టు మండలంలో మొత్తం 17 సచివాలయాలు ఉన్నాయి. అందులో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 540 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవల కోసం ప్రజలు పనులు మానుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. సమస్య ఏదైనా సరే గ్రామ సచివాలయంలో అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్యలను పరిష్కరించే విధంగా ఈ సచివాలయ వ్యవస్థను రూపొందించారు.

వలంటీర్లే జవాబుదారీ

గ్రామ సచివాలయ పరిధిలో ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీరును ప్రభుత్వం నియమించింది. వారే ఆ 50 కుటుంబాలకు అవసరమైన సేవలు అందిస్తున్నారు. గతంలో ఏ అవసరం వచ్చినా, ఏ అధికారి వద్దకో, ఏ నాయకుడి వద్దకో పరుగు తీయాల్సి వచ్చేది. వారు కూడా సక్రమంగా పట్టించుకునేవారు కాదు. ఇప్పుడు ఆ కుటుంబాలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్ జవాబుదారీగా వ్యవహరిస్తున్నారు. తద్వారా స్థానిక పాలనలో వేగం, కచ్చితత్వం అమలవుతున్నాయి. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి తలుపులను తట్టి మరీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు.



వావిల్‌తోట సచివాలయంలో ప్రజలకు సేవలు అందిస్తున్న సిబ్బంది

ఇంటి వద్దకే పెన్షన్



గత ప్రభుత్వంలో పింఛన్‌కోసం పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగి, తిరిగి కాళ్లు అరిగిపోయేవి. జన్మభూమి కమిటీ సభ్యులు ఎవరికి చెబితే వారికి మాత్రమే ఇచ్చేవాళ్లు. ఇప్పుడు ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు అర్హులందరికీ ఇస్తున్నారు. ఒకటో తేదీన వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ చేతికి ఇస్తున్నారు. ఈ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను.

– కె.ధనంజయనాయుడు, ఎర్రచెరువుపల్లి, పూతలపట్టు

పథకం	లబ్ధిదారులు	ఏటా లబ్ధి(రూ)
జగన్న అమ్మఒడి	2451	3,08,06,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	6667	1,68,29,500
వైఎస్సార్ చేయూత	1738	2,91,75,000
వైఎస్సార్ ఆసరా	6977	8,18,74,031
వైఎస్సార్ సున్నావడ్డీ	6436	1,23,83,591
ఈబీసీ నేస్తం	980	1,36,80,000
వాహనమిత్ర	151	15,80,000
కాపునేస్తం	179	26,58,000
రైతుభరోసా	6189	7,02,31,500
విద్యాదీవెన	868	1,81,32,783
వసతి దీవెన	862	1.08,75,200
జగన్న చేదోడు	100	10,00,000
వైఎస్సార్ బీమా	21	30,00,000
వైఎస్సార్ కళ్యాణ మస్తు	03	3,00,000

అందుబాటులో ఆధార్ సేవలు



"ఆధార్ కార్డులో తప్పుల సవరణకు పూతలపట్టు లేదా చిత్తూరుకు వెళ్ళాల్సి వచ్చేది. అక్కడ ఇచ్చే టోకన్లతో 8 రోజులు తర్వాత చేయించుకున్న సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు మా పంచాయతీ సచివాలయంలోనే ప్రభుత్వం ఆధార్ కేంద్రం ఏర్పాటుచేసింది. నా పనులన్నీ చూసుకొని, సమయం ఉన్నపుడు అధార్ సేవలను వినియోగించుకుంటున్నాను.

– పుష్పలత, నడింపల్లి, పూతలపట్టు

మెరుగైన సేవలు అందిస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రజలకు సచివాలయాల్లో 540 రకాల సేవలు అందిస్తున్నాం. ప్రజలకు మెరుగైన సేవలందించడమే ధ్యేయంగా ప్రభుత్వం సచివాలయాలను ప్రారంభించింది. దీంతో అన్ని రకాల సేవలు ప్రజల వద్దకే అందుబాటులో వచ్చాయి. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను సచివాలయంలోనే అందిస్తున్నాం.



– పి.గౌరి, ఎంపీడీఓ, పూతలపట్టు

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థుల ఎంపిక



ఎస్.అస్న



ఎస్.గీతిక



కె.తరుణ్

ఐరాల: మండలంలోని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని శనివారం హెచ్‌ఎం అరుణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 572 మార్కులు సాధించిన అస్న, 567 మార్కులు సాధించిన గీతిక ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించారు. 563 మార్కులు సాధించిన తరుణ్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించారన్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి



వరదరాజుల పల్లెలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

యాదమరి: గ్రామాల్లో క్రమం తప్పకుండా గర్భిణులకు, చంటి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ ఏఎన్‌ఎంలను కోరారు. ఆయన వరదరాజుల పల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో శనివారం ఆస్పత్రి సిబ్బంది గర్భవతులకు, చంటి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తుండగా వైద్యాధికారి పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడుతూ గ్రామాల్లో మాతాశిశు మరణాలు పూర్తిగా అరికట్టేందుకే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో ఉన్న ప్రతి గర్భిణికి, చంటి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'సురక్ష' సర్టిఫికెట్ల పంపిణీ





పూతలపట్టు: ధ్రువపత్రాలతో లబ్ధిదారులు, పైమాఘంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

తవణంపల్లె: మండలంలో అర్హులందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని పైమాఘం, కె.పట్నం గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంను దిగ్విజయంగా నిర్వహించారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం అజాద్ మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని వివరించారు. తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారికి వెంటనే మంజూరు చేస్తామన్నారు. అనంతరం పైమాఘంలో ప్రజాప్రతినిధులతో పైమాఘంలో 310 సర్టిఫికెట్లు, కె.పట్నంలో 184 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూరీసర్వే డీటీ వెంకటరమణ, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ కుమార్, అరగొండ సర్పంచ్ మల్లుదొరై, కె.పట్నం సర్పంచ్ పుష్పలత పాల్గొన్నారు.

జగనన్న సురక్ష– పేదల రక్ష

పూతలపట్టు: జగనన్న సురక్ష–పేదల రక్ష అని పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి అన్నారు. మండలంలోని యం.బండపల్లిలో శనివారం అధికారు లు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా పేద ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను సచివాలయాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సేవకు సంబంధించి 542 సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ యతీష్, సర్పంచ్ పద్మజాత్యాగరాజన్, ఉపసర్పంచ్ జ్యోతి, ఎంపీడీఓ గౌరి, రాజారత్నంరెడ్డి, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, నిరంజన్ రెడ్డి, ప్రవీణ్, మణి, బాలాజీ, షణ్ముగం, పంచాయతీ కార్యదర్శి హేమలత, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐరాల: సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పుల్లూరు సచివాలయ ఆవరణలో శనివారం ఎంపీడీఓ నాగరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పథకాల లబ్ధి కోసం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం 180 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిరత్నం, పంచాయతీ కార్యదర్శి శ్యామల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



గుడిపాల: వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందిస్తున్న వలంటీర్ల సేవలను చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొనియాడారు. మండలంలోని నారగల్లు, 197రామాపురం, కమ్మతిమ్మాపల్లె, మరకాలకుప్పం, బసవాపల్లె, నంగమంగళం, చీలాపల్లె, బొమ్మసముద్రం, పేయనపల్లె సచివాలయాల్లో శనివారం నిర్వహించిన వలంటీర్ల వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవరత్నాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని, వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లే విషయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషిచేయాలని పిలుపునిచ్చారు. వలంటీర్లు నిబద్ధతతో వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరొస్తోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. అనంతరం వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రజినీకాంత్, మొగిలిరెడ్డి, శిలంబరసన్, సాయిక్రిష్ణ, సాయిప్రతాప్, రవీంద్రారెడ్డి, కలైఅరసి, వరదరాజులురెడ్డి, జయకోడి, వెంకటేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దయానందరెడ్డి, గుణవతి, ఈశ్వర్‌రెడ్డిలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమకు సర్కారు ప్రోత్సాహం



మాట్లాడుతున్న పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకులు మోహన్‌బాబు

ఐరాల: పట్టు పురుగుల పెంపకాన్ని (సెరికల్చర్) మరింతగా విస్తరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతోపాటు, ఇందుకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తోందని పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు మోహన్‌బాబు తెలిపారు. మండలంలోని నాగంవాండ్లపల్లె రైతు భరోసా కేంద్రంలో శనివారం ఎంపీపీ మోహన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ పట్టు–బడి కార్యక్రమం నిర్వహించారు. మల్బరీ పంట సాగు, పట్టు పురుగుల పెంపకం పంట దిగుబడి, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు మోహన్‌బాబు వివరించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పట్టు సాగును విస్తరించేందుకు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా రాయితీలను కల్పించడం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసినట్లు వివరించారు. ఎకరా విస్తీర్ణంలో మల్బరీ మొక్కలు వేసుకునేందుకు రూ.18,750, 20 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవు షెడ్ నిర్మాణానికి రూ.3 లక్షలు, పరికరాలకు రూ.56,250 అందిస్తామన్నారు. మండల స్థాయిలో ఆసక్తి కలిగిన రైతులు సెరికల్చర్ సహాయకులు గణేష్ 9966282877ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు, వైస్ సర్పంచ్ మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సినీ నటుడు మాన్యం కృష్ణ

బంగారుపాళెం: యువత విద్యానైపుణ్యాలను పెంపొందించుకుని ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని సినీ నటుడు (జెట్టి ఫేమ్) మాన్యం కృష్ణ అన్నారు. స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 100 డ్రీమ్స్ ఆధ్వర్యంలో యువ తరంగ్ కార్యక్రమంలో భాగంగా మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, నేటి ఆధునిక సమాజంలో విద్యా నైపుణ్యాలకు కొరత లేదన్నారు. విద్యతో పాటుగా తమకు ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏరంగంలోనైనా రాణించాలంటే విద్యార్థులు బాగా చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభిమతం



వడ్డూరులో తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభిమతమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని కొదలమడుగు గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకు వచ్చిందని చెప్పారు. ఇప్పటికే 99 శాతం పథకాలు అర్హులకు అందించినట్లు వివరించారు. వంద శాతం లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 280 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం మండలంలోని కొదలమడుగు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఎమ్మెల్యే తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, పాలఏకరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచ్ మాలతి, ఎంపీటీసీ రవీంద్ర, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నవరత్న పథకాలతో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిచడమే సీఎం జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం బంగారుపాళెం గ్రామ సచివాలయం–1 పరిధిలోని గుంతూరు రోడ్డు, బిల్వమానువీధి, వడ్డూరు, జెండామాను వీధిలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. పింఛన్లు, పక్కా గృహాలు మంజూరు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వడ్డూరు, జెండామాను వీధిలో డ్రైనేజీ సమస్యతో అల్లాడుతున్నామన్నారు. అనంతరం వడ్డూరులో తాగునీటి బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ ఉషా, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, జిల్లా పార్టీ కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, కృష్ణమూర్తి, కామరాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎస్‌బీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ ప్రసన్నకుమార్, బీసీ నాయకుడు సురేంద్ర, రఘుపతిరాజు, సోషియల్ మీడియా కో–ఆర్డినేటర్ రెడ్డెప్ప, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బెన్నురాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తవణంపల్లె: మండలంలో ఖాళీగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. మండలంలోని టి.పుత్తూరు హరిజనవాడ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును ఎస్సీలకు రిజర్వు చేసినట్లు తెలిపారు. నారసింహనపల్లె అంగన్‌వాడీ సహాయకురాలు (బీసీ–ఎ), ఎగువమారేడుపల్లె అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్సీ) పోస్టులు ఖాళీగా రిజర్వేషన్ చేశారని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై, వివాహితులు స్థానికంగా ఉండి, 35 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులన్నారు. పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, కులం, నివాస, పుట్టిన తేదీ సంబంధిత సర్టిఫికెట్లతో పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ లోపల ఐరాల సీడీపీఓ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. అర్హులైన వారు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని పూర్తి వివరాలకు ఐరాల సీడీపీఓను సంప్రదించాలని కోరారు.